# నేడు కృష్ణపట్టెకు జల నేత కేసీఆర్

- హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండలో బహిరంగ సభలు
- ప్రజా ఆశీర్వాద సభల్లో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు హుజూర్‌నగర్‌కు చేరుకోనున్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని రామస్వామి గుట్టకు వెళ్లే మార్గంలోని విశాలమైన స్థలంలో ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఆధ్వర్యంలో వారం రోజులుగా సభా ఏర్పాట్లు చేశారు. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే సైదిరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం జరుగనున్న సభ కావడంతో సభికులకు అవసరమైన మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు సైతం విస్తృతంగా అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టారు. హుజూర్‌నగర్ సభా అనంతరం హెలికాప్టర్‌లో సీఎం కేసీఆర్ మిర్యాలగూడకు పయనం అవుతారు.

**మిర్యాలగూడ ఎన్ఎస్‌పీ క్యాంపు గ్రౌండ్‌లో...**

మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపు మైదానంలో ఏర్పాట్లు చేశారు. హుజూర్‌నగర్ నుంచి సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మిర్యాలగూడకు చేరుకుంటారు. పక్కనే కొద్ది దూరంలోనే హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. సీఎం రాక కోసం ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణానికి నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చే ప్రజలు సులువుగా చేరుకునేలా జాగ్రత్తలు తీసుకున్నారు. పట్టణానికి నలువైపులా సభా స్థలానికి కొద్ది దూరంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. అక్కడే తమ వాహనాలను పార్క్ చేసి కాలినడకన సభా ప్రాంగణానికి ప్రజలు చేరుకోవాల్సి ఉంటుంది. సభా ప్రాంగణంలోనూ మంచినీరు, మజ్జిగ లాంటి అన్ని చర్యలు చేపడుతున్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే భాస్కర్ రావు వెల్లడించారు.

**దేవరకొండలోని ముదిగొండ రోడ్డులో...**

దేవరకొండ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు పట్టణంలోని ముదిగొండ రోడ్డులో విశాలమైన స్థలంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. సీఎం కేసీఆర్ మిర్యాలగూడ నుంచి హెలికాప్టర్‌లో సాయంత్రం 3.30గంటల సమయంలో దేవరకొండకు చేరుకోనున్నారు. సభాస్థలికి సమీపంలోనే ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకోనున్నారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా వాహనంలో సభా వేదిక వద్దకు చేరుకునేలా చర్యలు చేపట్టారు. 2018 ఎన్నికల సమయంలోనూ ఇదే స్థలంలో సీఎం కేసీఆర్ సభ నిర్వహించారు. సభకు వేలాదిగా జనం తరలివచ్చే అవకాశాలు ఉండడంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే రవీంద్రకుమార్ స్వయంగా దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. సభా స్థలంలోనే ప్రత్యేక గ్యాలరీల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. దీంతో పాటు మంచినీరు, ఇతర సౌకర్యాలు సైతం ఏర్పాటు చేస్తున్నారు. సీఎం కేసీఆర్ రాక కోసం సర్వం సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ప్రకటించారు.

**స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమవుతున్న జనం**

ఉమ్మడి జిల్లా పరిధిలో జరుగుతున్న బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ బహిరంగ సభలకు జనం తండోపతండాలుగా తరలొస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన భువనగిరి, మునుగోడు, కోదాడ, తుంగతుర్తి, ఆలేరు నియోజకవర్గాల ప్రజా ఆశీర్వాద సభలకు జనం పోటెత్తారు. ఏ సభలో చూసినా భారీ జన సందోహం కనిపించింది. ఆయా నియోజకవర్గాల నలుమూలల నుంచి చిన్నా పెద్దా, ముసలి ముతక, ఆడ మగ తేడా లేకుండా సభకు తరలివస్తుండడంతో అన్ని చోట్ల జన జాతరలను తలపించాయి. ఊహించిన దాని కంటే రెట్టింపు సంఖ్యలో సభలకు వచ్చి కేసీఆర్ ప్రసంగాన్ని శ్రద్ధగా ఆలకిస్తున్నారు. అన్ని చోట్ల కేసీఆర్ ప్రసంగాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నది. ఇక నేడు జరుగనున్న హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ సభలకు సైతం వేలాదిగా తరలివచ్చేందుకు జనం సన్నద్ధం కావడం విశేషం. సీఎం కేసీఆర్ సభలకు వస్తున్న స్పందనను చూస్తుంటే ఉమ్మడి జిల్లాలో మరోసారి అన్ని స్థానాల్లో గులాబీ జెండాకు ఎదురుండదన్న చర్చ జోరుగా సాగుతోంది.

# సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి

- ప్రతిపక్ష నాయకుల అసత్య ప్రచారాలు నమ్మొద్దు
- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి
- వలిగొండలో ఎమ్మెల్యేతో కలిసి ఇంటింటి ప్రచారం


వలిగొండలో పైళ్ల శేఖర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలు, చిత్రంలో రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి

వలిగొండ, అక్టోబర్ 30 : ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాయని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. భువనగిరి నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న పైళ్ల శేఖర్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు బీమా, ఆసరా పింఛన్లు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ వంటి సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ఓటెయ్యాలని కోరారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల లబ్ధిపొందని కుటుంబం లేదని, ప్రతిపక్ష నాయకులు చెప్పే అసత్య ప్రచారాలను నమ్మి మోసపోవద్దని సూచించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం ముద్దాపురం, వెంకటాపురం గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన 50 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొలుపుల కమలాకర్, ఏఎంసీ చైర్మన్ పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సుర్కంటి వెంకట్‌రెడ్డి, రైతు బంధు సమితి మండల కన్వీనర్ పనుమటి మమతానరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, మొగిళ్ల శ్రీనివాస్, ఎంపీటీసీ పల్సం రమేశ్, కొమిరెల్లి సంజీవరెడ్డి, సోలిపురం సాగర్ రెడ్డి, ఎమ్మె లింగస్వామి, రవీంద్ర, రత్నయ్య, గంగాధరి రాములు, సత్యనారాయణ, పబ్బు వెంకటరమణ, సామ రాంరెడ్డి, కొత్త నర్సింహ, వెంకటేశం పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు యశీల్‌గౌడ్

భువనగిరి అర్బన్, అక్టోబర్ 30 : ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు జడల యశీల్ గౌడ్ అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు ముల్లె నాగేంద్రబాబు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చిలువేరు మధు, ప్రధాన కార్యదర్శి పోల ప్రవీణ్‌కుమార్, విద్యార్థి సంఘం మండలాధ్యక్షుడు కంకల మహేశ్, జాగృతి మండలాధ్యక్షుడు వినయ్, నాయకులు రత్నపురం సురేశ్, గణేశ్, శివ పాల్గొన్నారు.

## సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 30 : మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ఎలాంటి ఎజెండాలు, తీర్మానాలు లేకుండా సాదాసీదాగా జరిగింది. సమావేశంలో జడ్పీటీసీ కె.నరేందర్‌గుప్తా, ఎంపీడీఓ ఎండీ నిరంజన్‌వలి, వైస్ ఎంపీపీ పద్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సూపర్ మార్కెట్‌లో పదార్థాల శాంపిల్స్‌ను సేకరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి

## ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 30 : భువనగిరి పట్టణంలోని సూపర్ మార్కెట్లలో సోమవారం ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ ఎం.సుమన్ కళ్యాణ్, జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి స్వాతి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆహార పదార్థాల తయారీ తేదీలు, నాణ్యతను పరిశీలించారు. శాంపిల్స్‌ను సేకరించి హైదరాబాదులోని టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంపుల్స్ కల్తీ అని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సూపర్ మార్కెట్లలో నాణ్యమైన, శుభ్రమైన ఆహారపదార్థాలను మాత్రమే విక్రయించాలని సూచించారు.

## భువనగిరి ఖిల్లాను సందర్శించిన పురావస్తుశాఖ అధికారులు


ఖిల్లాను సందర్శించిన కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 30 : కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులు సోమవారం భువనగిరి ఖిల్లాను సందర్శించారు. ఈ సందర్భంగా ఖిల్లాపై నీటి కొలనులతో పాటు ఖిల్లా కింద సమీపంలోని సంతోషిమాత ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి వివరాలను ఎండోమెంట్‌కు తెలియజేయాలని ఆలయ కమిటీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం భువనగిరి మున్సిపాలిటీ టీపీఓ కృష్ణవేణి సర్వేయర్‌తో కలిసి ఖిల్లాకు సంబంధించిన వివరాల గురించి చర్చించారు. ఖిల్లాను సందర్శించిన వారిలో కేంద్ర పర్యాటక శాఖ ఏడీ కృపాకర్ రావిపాటి, రాష్ట్ర పర్యాటక శాఖ జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి ధనుంజనేయులు, పురావస్తు శాఖ డీడీ నారాయణ, ఏడీలు రాజు, ఓంప్రకాశ్, బుజ్జి, భువనగిరి ఖిల్లా ప్రాజెక్టు అధికారి గంగాధర్, ఎల్అండ్‌టీ బృందం నాయకులు సుమతి, టీపీఓ కృష్ణవేణి, సర్వేయర్ రజినీకాంత్ ఉన్నారు.

**రెండు నెలల్లో పనులు ప్రారంభం!**

స్వదేశీ దర్శనం కింద భువనగిరి ఖిల్లాను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 100 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ఖిల్లా అభివృద్ధి కోసం ఎల్అండ్‌టీ సంస్థకు డీపీఆర్ రూపకల్పన కోసం బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ డీపీఆర్ చివరి దశకు చేరుకున్నట్లు సమాచారం. ఖిల్లా అభివృద్ధిలో భాగంగా రూప్‌వే నిర్మాణం, నీటి కొలను చుట్టూ పెన్సింగ్, కొండపై రెస్టారెంట్లు, విశ్రాంతి గదులు, పార్కులు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈ పనులు నిర్వహించేందుకు అవసరమైన మెటీరియల్‌ను కొండపైకి తరలించేందుకు లిఫ్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో రెండు నెలల్లో ఖిల్లా పై భాగంలో పనులు ప్రారంభంకానున్నట్లు సమాచారం.

## అధికారులకు రెండ్రోజులు శిక్షణ

- కలెక్టర్ హనుమంతు కే. జెండగే


మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే. జెండగే

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 30 : జిల్లాలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు రెండ్రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే జెండగే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మంగళవారం, బుధవారం భువనగిరి పట్టణంలోని వెన్నెల కాలేజీలో ఉదయం 9 నుంచి 1.30 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. 1,005 ప్రిసైడింగ్, 1,005 అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు శిక్షణలో పాల్గొంటారన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల విధులకు హాజరుకావాలని, ఎలాంటి మినహాయింపు లేదని, విధులకు గైర్హాజరైతే రిప్రజెంటేటివ్ ఆఫ్ పీపుల్ యాక్ట్ 1951 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ రోజుకు 3 రోజుల ముందు సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చునని చెప్పారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

## రాష్ట్రస్థాయి జూడో పోటీలకు విద్యార్థుల ఎంపిక

బీబీనగర్, అక్టోబర్ 30 : రాష్ట్రస్థాయి జూడో పోటీలకు మండల విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ షేక్ పర్వేజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ గేమ్ సెక్రటరీ స్టాలిన్ బాబు అధ్యక్షతన జిల్లాస్థాయి జూడో పోటీలను నిర్వహించారని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 30కి పైగా పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. బీబీనగర్ మండలం నుంచి పి.తేజస్విని, జి.సుష్మ, ఎన్.లాస్య, మణికంఠ, మణిదీప్, రతన్ సింగ్, సందీప్, మధు, మణికంఠ, భార్గవ్, చాణిక్య గెలుపొందినట్లు తెలిపారు. నవంబర్ 1 నుంచి 3 వరకు వరంగల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.